శ్రీకాకుళం

# 9

ఆతృతగా, అటూ ఇటూ చూసాను. వాసుజాడ లేదు. రోజూ, ఈ సమయానికి, వాడు కూడా పార్కులోకి రావటం పశ్చికపై కూర్చుని కబుర్లు చెప్పుకోవటం మేం ఇంటికి తిరిగి వెళ్లడం పరిపాటి. కాని ఈ రోజు వాడు రాలేదు. ఏమైనట్టు?

మరోసారి చుట్టూ చూసాను. పార్కులో హడావిడి తగ్గిపోయింది. అంత వరకు పిల్లల కేరింతలతో, పడుచువాళ్ల కబుర్లతో కళకళ లాడిన పార్కు ఆత్మీయులు విడిచి పెట్టిన ముసలి వాడి ఇల్లులా వుంది. ముసలివాడి జీవితంలో నుంచి రాలిపోయిన ఘట్టాల్లాంటి దీపాలు ఒకొక్కటిగా కళ్లు మూస్తున్నాయి.

వాసు నాకు ఆప్తుడు. పదవీ విరమణ చేసాక, మనసు విప్పి కాసేపు మాటలాడుకోవటానికి, అందుబాటులో వుండే ఒకే ఒక్క మిత్రుడు. ఒకే చోట కలిసి ముప్పది సంవత్సరాలు పనిచేసాం. ఒకే సారి పదవీ విరమణ చేసాం. ఒకే కాలనీలో వుంటున్నాం. రోజు ఈ పార్కులోనే కలుసుకొని ఉద్యోగం చేసిన నాటి ముచ్చటలను నెమరు వేసుకుంటూ, పదవీ విరమణ చేసాక అనుభవిస్తున్న కష్టాలు గురించి చెప్పుకుంటూ పార్కులో రెండు మూడు గంటలు గడిపేస్తాం. జీవితంలో స్థిరపడని తన పిల్లల గురించి అందువల్ల ఎదురయ్యే సమస్యల గురించి ఆందోళన చెందుతూ ఉంటాడు వాసు. 'అలా బాధపడితే ఎలాగరా?". "దేనికైనా ఒక టైం రావాలి కాదా!" అని నేనంటే "నీవు అలాగే అంటావులే, నీకేమిటి, నీవు ఒడ్డుకు చేరినవాడివి. నడి సముద్రంలో వున్నవాడిని నేను" అని అంటుంటాడు.

నా తాత్విక ధోరణి అతనికి నచ్చేది కాదు. బాగా ఎదిగినా, పూయని మొక్కలని చూస్తు నిట్టూస్తూ కూర్చుండేవాడు, వాసు. "పిల్లలు స్థిరపడలేదని నేను అంతగా బాధపడటం లేదురా. రిటైర్ అయ్యాక నేను ఇంటిలో స్థానం కోల్పోయాను. అడిగినంత డబ్బు ఇవ్వలేక

పోతున్నాను". వాసు ఒకసారి అన్నాడు.

"అదేమిటిరా, డబ్బుని బట్టేనా తల్లి దండ్రులపై ఆప్యాయత.."

"ముమ్మాటికీ, అంతేరా.. ఇది డబ్బుల యుగం. డబ్బు గురించి తల్లిదండ్రులని చంపటానికి కూడా వెనుకాడటం లేదు కదా!" వాసు ఒక నిమిషం ఆగాడు. ఆ తరువాత అన్నాడు "చూడు అటుచూడు".

తాను కావాలని అనుకొనె వస్తువుని పేచీ పెట్టి కొనిపించే ఒక పదేళ్ళ బాలుడ్ని చూపిస్తూ.. అన్నాడు వాసు. "వీళ్ళేగా రేపటి యువకులు. చిన్నప్పటి నుంచీ మొండిపట్టుదల ఎలా పెంచుకుంటున్నారో, చూడు."

నేను కొంతసేపు మౌనం వహించాను.

మళ్ళీ తానే అన్నాడు "నేటి పిల్లల గురించి నీకు తెలియదులే.. చిన్నప్పుడే పెళ్ళి చేసుకున్నావు పిల్లలకు కూడా చిన్న వయస్సులోనే పెళ్ళిల్లు చేసేసావు హాయిగా కాలక్షేపం చేస్తున్నావు.'

నిజమే అమ్మాయిలిద్దరూ పెళ్ళి చేసుకొని స్థిరపడ్డారు. నగరంలో ఇల్లుంది. రిటైర్ అయినప్పుడు కొంత డబ్బు వచ్చింది ఇంకా ఏం కావాలి? ఇది బయటకు కనబడేది. కాని టెంకని, లోపల తొలుచుకు తినే పురుగున్నా బయట నిగనిగలాడే 'కలెక్టర్ మామిడి పండులాంటిది', తన జీవితమని అప్పుడైన వాసుకే తెలియదు మరి.

గట్టిగా నిట్టూర్చాను. పొద్దున ఇంటికి వచ్చినప్పటి నుంచి కన్నీరు మున్నీరుగా ఏడ్చే చిన్నమ్మాయి మనసులో కదిలింది.

"చిన్నది అలా ఏడుస్తూనే వుందండి" పార్కుకు బయలుదేరే ముందు కూడా మా ఆవిడ అంది.

" వచ్చినప్పుడు నుంచి పచ్చి మంచినీరైనా ముట్టలేదండి దాన్ని అలా ఏడ్పించే బదులు ఏదో ఒకటి చెప్పవచ్చు కదండి."

"నేనేం చెప్పనే! ప్రతిసారి లక్షలు అడుగుతూ వుంటే ఎక్కడ నుంచి తెచ్చేది...!"

చెప్పుల్లో కాళ్లు దుర్చాను.

ప్రపంచం కోసం, తన వెలుగంతా ధారపోసిన సూర్యుడు చల్లబడి ఆఖరి వెలుగు చుక్కలు ప్రసరిస్తున్నాడు.

చిన్నమ్మాయికి మంచి సంబంధమే చేసాను. కోట్లకు పడగెత్తే అల్లుడు, లక్షలలో వ్యాపారం.. అయినా అప్పుడప్పుడు అత్యవసరమని, సర్దుబాటు కాలేదని డబ్బు తీసుకొని వెళ్లేవాడు. అల్లుడికిచ్చిన సొమ్మూ సున్నంలో పోసిన డబ్బూ తిరిగి రాదుకదా! రిటైర్ అవ్వంగానే వచ్చి మూడు లక్షలు తీసుకున్నాడు. ఇప్పటికింకా వాపసు ఇవ్వలేదు.

"డబ్బులివ్వరంటే, ఆ మాటే చెప్పేయండి. అల్లుడుగారు వెళ్లిపోతారు". మా ఆవిడ అంది. "లక్షేగా అడిగింది.రిటైర్‌మెంటు డబ్బు వుంది కదా!"

"ఆయన ఊరికనే అడగటం లేదు నాన్నా" మా అమ్మాయి మాట్లాడింది." వడ్డీతో సహా తిరిగి ఇచ్చేస్తారు. కొద్దిగా ఇబ్బంది వచ్చి....."

నేను స్పందించ లేదు. ముందుకు అడుగులు వేసాను. మొన్న మొన్నటి వరకు పెద్దమ్మాయి గురించే బాధపడేవాడ్ని. తొందరపడి పెళ్లి చెయ్యటం వల్ల సరిగా ఆలోచించక, ఒక చిన్న ఉద్యోగస్తుడికి ఇచ్చి పెళ్లి చేసేసాను. ఏ అవసరం వచ్చినా నా మీదే ఆధారపడే పెద్దమ్మాయి అంటే నాకు జాలి. అక్క గురించి నేను ఎక్కువగా డబ్బుఖర్చు చేస్తున్నానని మా చిన్నమ్మాయికి నామీద కోపం కూడా వస్తుండేది. పెద్దమ్మాయి అల్లుడు ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారని ఊపిరి పీలుస్తూ వుంటే మొదలైంది చిన్నమ్మాయితో బాధ.

నాకు విసుగు వచ్చింది. నిస్సహాయత వల్ల కోపం కూడా వచ్చింది.

పచ్చిక మీద నుంచి లేచాను.

చేతులో వున్న కొంత వెన్నెల ఖర్చు చేసి పాపరైన చవితి చంద్రుడు ఆకాశం విడిచి వెళ్లిపోయాడు.

గబగబ అడుగులు వేసాను. వాసుని కలవాలి. వాడికి ఏమైంది?

పార్కు వెనుక గోడవైపు నడుస్తూ.. వుంటే పరిచయమున్న గొంతు వినబడింది.

"మీ నాన్న డబ్బు ఇస్తారంటావా?" మా అల్లుడి గారి గొంతు.. నేను ఆగిపోయాను.

"ఏమోనండి, నాన్నదగ్గర డబ్బు లేదనుకుంటా.."

ఖచ్చితంగా ఆ గొంతు మా చిన్నమ్మాయిదే!

"పావం మామగారు! డబ్బులేక ఇవ్వలేనని చెవ్వలేక బాధపడుతున్నట్టున్నారు. డబ్బు వద్దని చెప్పేయి. మనకు ఇప్పుడు పెద్ద అవసరం లేదుగా.."

"అలా అంటారేమిటండి? మీకు ఎంత చెప్పినా అర్థం కాదు" మా చిన్నమ్మాయి విసుక్కుంది.

ఒక నిమిషం మాటలు ఆగాయి, "మనం మెత్తబడితే లాభం లేదండి నాన్న వున్నప్పుడే వచ్చినంత లాగేసుకోవాలండీ".

మళ్లీ ఒకనిమిషం నిశ్శబ్దం.

"అస్సలే మా నాన్నకి అక్క అంటే అప్యాయత ఎక్కువ. అది నాన్న దగ్గరే ఊరిలోనే ఉంటుంది ఏవో కారణాలుచెప్పి వచ్చినంత డబ్బంతా తీసుకోక పోతే మనకు లాభం ఉండదండి నాన్న తదనంతరం ఉన్నది సగం సగమేగా. అందుకే మనం ఈ నాటకం ఆపకూడదండీ.."

నా బుర్ర తిరిగిపోయింది. పిల్లలకి, తల్లిదండ్రులకి మధ్య వుండే సంబంధం డబ్బుదేనా..!

లోగుట్టు పెరుమాళ్లకెరుక...!